క్లుప్తంగా

కిరణ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మేరుగ



కర్లపాలెం: వైఎస్సార్‌సీపీ నాయకులు కత్తి కిరణ్‌కుమార్ తండ్రి ఆదాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున మంగళవారం కర్లపాలెం మండలంలోని బుద్ధాం గ్రామంలో కత్తి కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిరణ్‌కుమార్‌ను పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు ఆట్ల నాగేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు వడ్డిముక్కల డేవిడ్, మండే విజయ్‌కుమార్, పేరలి రాజేష్, నిరీక్షణరావు తదితరులు ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే మన్ననలు



చెరుకుపల్లి: విధులను అంకితభావంతో నిర్వర్తిస్తే ఏడీఏ సురేష్ బాబు అన్నారు. కావూరు సబ్ స్టేషన్‌లో మంగళవారం చెరుకుపల్లి విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగం వెంకటేశ్వర రావు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పని చేసే వృత్తిని దైవంగా భావించి పనిచేస్తే అందరి మన్ననలు పొందవచ్చన్నారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను విద్యుత్ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పునరావాస కేంద్రాలలోనే పెన్షన్‌లు పంపిణీ

రేపల్లె: వరద ప్రభావానికి లోనై పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న పెన్షనర్‌లకు అక్టోబర్ 1వ తేదీన పునరావాస కేంద్రాలలోనే పెన్షన్‌లు పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పునరావాస కేంద్రాలలో ఉన్న అర్హులైన వారికి అధికారులు ప్రత్యక్షంగా వచ్చి పెన్షన్‌లు పంపిణీ చేయటం జరుగుతుందని, పెన్షన్‌దారులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని పేర్కొన్నారు.

వరద ముంపుపై అధికారులతో సమావేశం



కొల్లూరు(వేమూరు): వరద ముంపుకు గురయిన లంక గ్రామాల ప్రజలకు పునరావాసం, సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన లంక గ్రామాల ప్రజలకు పునరావాసం, సహాయక చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు తక్షణ సహాయం అందించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని చెప్పారు. లంక గ్రామాల ప్రజలకు ఆహారం, తాగు నీరు, వైద్య సదుపాయాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం అందించే అన్ని సహాయక చర్యల ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్ పర్సన్ పూర్ణకుమారి, ఉసా రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేట ఇందిరానగర్ కాలనీకి చెందిన 22 ఏళ్ల యువతి సెప్టెంబర్ 26న విజయవాడలో కోచింగ్‌కి వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్ళి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు మంగళవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో...



నగరంలో దుర్గాదేవిగా అమ్మవారు



కనకదుర్గమ్మగా గ్రామ దేవత బూరుగులమ్మ



చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గమ్మగా...



కొత్తనందాయపాలెంలో దుర్గాదేవిగా...



సమ్మెటవారిపాలెంలో దుర్గాదేవిగా...



కనగాల పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో...

దుర్గాదేవి.. నమోస్తుతే



బాపట్ల రాజీవ్‌గాంధీ కాలనీలో దుర్గాదేవిగా...

రేపల్లె: దేవి శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం పట్టణంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు కనకదుర్గమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారు, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు, స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు, పేటేరులోని మహాలక్ష్మి గుండెపోటమ్మ అమ్మవార్లు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పసుపు, కుంకుమ్మలతో కూడిన సారెను సమర్పించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా 16వ వార్డు ఇసుకపల్లిలో వేపాళమ్మ, పోతురాజు స్వామి ఆలయ ఆవరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బాపట్లటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామంలో వేంచేసియున్న అనసూయదేవి అమ్మవారు మంగళవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వజననీ పరిషత్ ట్రెజరర్ జేఎల్‌పీ సుబ్రమణ్యం మాట్లాడుతూ అమ్మవారికి స్వర్ణకిరీట ధారణ చేశామన్నారు. చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో సనాతన హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ముత్తాయపాలెంలో ఏర్పాటు చేసిన ప్రసన్న దుర్గాభవాని విగ్రహం వద్ద మంగళవారం భక్తులకు అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి పంచలోహ విగ్రహానికి గ్రామస్తులు పంచామృతాభిషేకం చేశారు.

నగరం: దుర్గాష్టమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం కనకదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ధూళిపూడిలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొలగానివారిపాలెం, ఈదుపల్లి, మీసాలవారిపాలెం, చిరకాలవారిపాలెం, నగరం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలకు దుర్గాదేవి అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో లలితా సమేత స్వయంభువేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అర్చకులు సాయి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకారం చేశారు. వలివేరు గ్రామానికి చెందిన ఈమని జగన్‌మోహన్ రెడ్డి, లావణ్య దంపతులు చండీయాగంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చావలి(వేమూరు): వేమూరు మండలంలోని చావలి గ్రామం వాలేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం దుర్గాదేవిగా అలంకారం చేశారు. దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చెరుకుపల్లి: దేవి శరన్నవాత్రుల్లో ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయటం ద్వారా సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఓరుగంటి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీరాల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పిట్టుకోటిరెడ్డిపాలెంలో 87వ వార్షిక దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు సామూహిక సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏత్రా అశ్వనిశ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కర్లపాలెం: దసరా మహోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు పూజలందుకున్నారు. మండల పరిధిలోని బోలాయపాలెం, యాజలి, బుద్ధాం, కొత్తనందాయపాలెం, సమ్మెటవారిపాలెం, నల్లమోతువారిపాలెం, చింతాయపాలెం గ్రామాలలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

చెరుకుపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో పవిత్రమైన దుర్గాష్టమిని పురస్కరించుకుని మంగళవారం పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుళ్ళపల్లి గంగాబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో, చెరుకుపల్లి ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో, కనగాల పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో, పొన్నపల్లి సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



వలివేరు స్వయంభునేశ్వరస్వామి దేవస్థానంలో చండీయాగం



ముత్తాయపాలెంలో దుర్గమ్మ విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

ఘనంగా మోదుకూరు కనకదుర్గ తిరునాళ్ల



మోదుకూరు రామచౌడేశ్వరస్వామి ఆలయం

- అర్ధరాత్రి మహాకుంభం సమర్పణ.. ఆలయం మూసివేత
- తిరిగి 8వ తేదీ నుంచి అమ్మవారి దర్శనం

చుండూరు(వేమూరు): దసరా శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గ సమేత రామచౌడేశ్వరస్వామి దేవాలయంలో దుర్గాష్టమి మహర్నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారి తిరునాళ్ల అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దసరా నవరాత్రులు తొలి రోజు నుంచి ఘనంగా పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారికి మహాకుంభం సమర్పించి ఆలయంతలుపులను మూసివేస్తారు.



మోదుకూరు కనకదుర్గాదేవి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకునే వరకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యమిస్తూనే ఉంటామని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ హెచ్చరించారు. మంగళవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఎస్సీ విభాగాల వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలతో గుళ్లపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా బాపట్ల తరలివెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు పాల్పడటం ద్వారా ఇటు రాష్ట్రంలోని నిరుపేదల ఆరోగ్యంతో, అటు పేద మెడికల్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ప్రతి సారి పేద ప్రజలను చిన్నచూపు చూస్తూ పెత్తందారులకు కొమ్ము కాస్తుందని డాక్టర్ గణేష్ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మానుకోవాలని లేని పక్షంలో పార్టీ ఆదేశాల మేరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని డాక్టర్ గణేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిత్రాల ఓబేదు, రేపల్లె రూరల్ మండల కన్వీనర్ మేడికొండ అనిల్, చెరుకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి, జిల్లా క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కంచర్ల ప్రభు, నీలా నాంచారయ్య, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శులు కొత్తపల్లి రమేష్, బినిగే సువర్ణరాజు, చౌటూరి రమేష్, కిరణ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజవాడ జోసఫ్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గాలిమోటు రాజశేఖర్, రేపల్లె పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కమల్ రాజ్‌గోపాల్, చెరుకుపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండాల కాంతారావు, జాలాది ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్, పక్కన ఎస్సీ నాయకులు

బొమ్మువానిపాలెంలో వింత పాములు

కొల్లిపర: కృష్ణానదిలో వరద ఉధృతి కారణంగా బొమ్మువానిపాలెం గ్రామంలోకి మంగళవారం రెండు తలలతో ఉన్న వింత పాములు వరద నీటితోపాటు గ్రామంలోకి కొట్టుకువచ్చాయి. వాటిని చూసి గ్రామంలో గతంలో ఎన్నడూ ఇటువంటి వింత పాములను చూడలేదని గ్రామస్తులు తెలిపారు. యువకులు ధైర్యం తెచ్చుకుని వాటిని ఒక గోనెసంచిలో బంధించి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, వాటిని అప్పగించారు. గ్రామంలో రెండు తలల పాములు కనిపించాయన్న సమాచారం వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల వారు వాటిని చూడటానికి ఎగబడ్డారు. వాటిని ఫొటోలు తీసుకున్నారు.



ఖాళీ స్థలాలు.. వ్యాధుల నిలయాలు

- విష సర్పాలు, దోమలకు ఆవాసం
- తెనాలిలో 400లకు పైగా ఖాళీ స్థలాలు
- గతంలో చర్యలు.. ప్రస్తుతం పట్టించుకోని అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఖాళీ స్థలాల సమస్య జటిలంగా మారుతుంది. ఇవి జనవాసాల మధ్య ఉండటం వల్ల వీటిలో విషసర్పాలు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే దోమలకు ఇవి నిలయాలుగా మారటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండటం... అమరావతి రాజధానికి అతి సమీపంగా ఉండటంతో ఇక్కడ నివశించేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తిని కనపర్చుతూ ఉంటారు. అంతేకాకుండా తెనాలి పట్టణంలో తాగు నీటి కొరత కూడా ఉండదు. దీంతో పల్లెలలో నివశించేవారు, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన వారు తెనాలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం పట్టణంలో 1.60లక్షలకు పైగా జనాభా ఉన్నరంటే తెనాలి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో మనకు అర్థమవుతుంది. జనాభా పెరిగిన రీతిలోనే స్థిర నివాసాలు పెరుగుతున్నాయి.

400లకు పైగా ఖాళీస్థలాలు..

తెనాలి పట్టణంలో ఇళ్ల మధ్య సుమారు 400కు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయనేది అధికారుల అంచనా. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు, పురుగులకు, పందులకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాకుండా స్థలాలు పల్లంలో ఉండటం వల్ల సమీపంలోని మురుగు నీరు, వర్షపు నీరు దానిలో చేరి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తరచు వాటిని బాగు చేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

గతంలో వేకెంట్ ల్యాండ్ యాప్‌తో చర్యలు..

తెనాలి మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను బాగు చేయించేందుకు వేకెంట్ ల్యాండ్ అనే ప్రత్యేక యాప్‌ను గతంలో రూపొందించారు. దానిలో ఖాళీ స్థలాలను నమోదు చేసి, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించేవారు. యజమానుల ఆచూకీలేని స్థలాలను మున్సిపల్ సిబ్బందితో బాగు చేయించి దానికి అయిన ఖర్చును అందులో నమోదు చేసేవారు. ఎప్పుడైనా ఆ స్థల యజమానులు భవన నిర్మాణ ప్లాన్‌కు వచ్చినప్పుడు వారి నుంచి స్థలం బాగు చేయించినందుకు అయిన ఖర్చును వసూలు చేసి తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చి ప్లాన్ ఇచ్చేవారు. ఇలా మూడు సంవత్సరాలు జరిగిన తర్వాత దాని ఊసే అధికారులు మరిచారు. ఇదిఇలా ఉంటే గతంలో అధికారులు నోటీసులు ఇచ్చిన స్పందించిన యజమానులకు బుద్ధి చెప్పేందుకు వారి స్థలాలలో ఇది మున్సిపల్ స్థలం అనే బోర్డులు ఏర్పాటు చేశారు. ఆప్రక్రియ నేడు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బాలాజీరావుపేటలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



విషసర్పాలకు నిలయంగా మారిన ఖాళీస్థలం

కఠిన చర్యలు తీసుకుంటాం..



పట్టణంలోని ఖాళీ స్థలాల యజమానులను గుర్తించే పనిలో ఉన్నాం. వారికి నోటీసులు ఇచ్చి బాగు చేయించాలని సూచిస్తాం. అప్పటికి స్పందించకపోతే లీగల్‌గా వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– పినప శ్రీకాంత్, ఇన్‌చార్జి కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తెనాలి: నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆరుగురికి రూ.5,35,959 చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. 21వ వార్డు ఎస్పీపీ రోడ్డులోని ఓ దుకాణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో విక్రయానికి ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను గుర్తించారు. 132 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకట రమణారావుకు అభినందన

తెనాలి: పట్టణానికి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు విజయవాడలోని శ్రీకనకదుర్గ దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన్ను హిందూ ధార్మిక సంస్థలు సత్కరించాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు కోట రాజేష్, కార్యదర్శి రామాంజనేయులు, హిందూ చైతన్య వేదిక సంయోజక పొట్టి మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రమణారావును సత్కరిస్తున్న వీహెచ్‌పీ, హిందూ చైతన్య వేదిక సభ్యులు